TGTEL/25/A0977

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 సంచిక : 89 గురువారం 27-11-2025 ఎడిటర్ : ముఖేష్ వీరంటి పేజీలు: 5 వెల : 5 రూ/.

## నేటి నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్లు

**ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్**

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దిశానిర్దేశం**

**ఎన్నికలు సజావుగా నిర్వహించాలని సూచన**

హైదరాబాద్,నవంబర్26:
గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని ఆమె సూచించారు. కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల నియామావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆమె అన్నారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియతో పాటు భద్రత, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సందర్భంగా చర్చించారు. అదనపు డీజీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## జనాభా లెక్కలకు భిన్నంగా రిజర్వేషన్లు

**హైకోర్టులో కేసు దాఖలు**

**హైదరాబాద్,నవంబర్ 26 :** తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు నగారా మోగింది. ఈ నేపథ్యంలో పంచాయతీ రిజర్వేషన్లపై పలువురు గ్రామస్తులు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించలేదంటూ ఒకరు పిటిషన్ వేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ తిమ్మనోనిపల్లి రిజర్వేషన్లపై మరో పిటిషన్ దాఖలైంది. వార్డులన్నింటిని ఎస్సీ, ఎస్టీలకే కేటాయించారంటూ ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల కంటే బీసీల జనాభా అధికంగా ఉందంటూ ఇంకో పిటిషనర్ ఆరోపించారు.సంగారెడ్డి జిల్లాలో పలు గ్రామాల్లో సరైన రిజర్వేషన్ల పాటించడం లేదంటూ ఆంధోల్ మండలం రామసానిపల్లికి చెందిన మాజీ సర్పంచు ఆగమయ్య పిటిషన్ దాఖలు చేశారు. రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం జీఓ 46 తీసుకొచ్చిందని పిటిషనర్ పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 613 గ్రామ పంచాయతీలు ఉన్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కానీ బీసీలకు 117 సర్పంచు స్థానాలనే రిజర్వు చేశారని చెప్పారు.సంగారెడ్డి జిల్లాలో బీసీ రిజర్వేషన్లు 19 శాతమే ఉందని పిటిషనర్ న్యాయవాది వెల్లడించారు. సంగారెడ్డి కలెక్టర్ జారీ చేసిన గెజిట్‌ను రద్దు చేసి మళ్లీ రిజర్వు చేసేలా ఆదేశించాలని కోర్టును పిటిషనర్ కోరారు.

## అవినీతి అనకొండ సిఎం రేవంత్

**మున్సిపాలిటీల విలీనం దారుణం**

**మండిపడ్డ మాజీ మంత్రి కెటిఆర్**



హైదరాబాద్,నవంబర్25
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆయన అన్నదమ్ములు, అనుయాయులతో కలిసి ఓ అవినీతి అనకొండ మాదిరిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన హెచ్‌ఐఎల్‌టీపీ పాలసీపై ఆయన నిప్పులు చెరిగారు. పరిసర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రతిపాదనపై తీవ్రంగా స్పందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 'మాజీ సీఎం కేసీఆర్ హయాంలో పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాలుగా మార్చడం జరిగింది. అదే విధంగా కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త పురపాలికలు ఏర్పాటు చేశారు. తాండాలను అప్‌గ్రేడ్ చేసి 8,800 గ్రామ పంచాయతీలను 12,800కు పెంచడం జరిగింది. అధికారాన్ని వికేంద్రీకరించి, ప్రభుత్వాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నం చేసింది' అన్నారు.'ఈ విషయంలో ప్రభుత్వం ఎవరితో చర్చించిందో తెలియదు. ఎందుకంటే, మున్ని పాలిటీల్లో ఎలాంటి తీర్మానాలు జరగలేదు. ఏ ఒక్క మున్సిపాలిటీ నుంచి కూడా కనీసం తీర్మానం తీసుకోలేదు. మున్సిపాలిటీలు కొలువు తీరి లేవు కాబట్టి ప్రజలతో నేరుగా అభిప్రాయ సేకరణ చేశారా ? అంటే అదీ చేయలేదు.

## జీఎంఆర్ ఏరోపార్క్‌లో

# సఫ్రాన్ సెంటర్

**- వర్చువల్‌గా ప్రారంభించిన మోడీ - అభినందనలు తెలియచేసిన సిఎం రేవంత్**



హైదరాబాద్,నవంబర్ 26: తెలంగాణపై నమ్మకంతో హైదరాబాద్‌ను ఎంచుకున్న సఫ్రాన్‌కు సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. శంషాబాద్ సమీపంలోని జీఎంఆర్ ఏరోపార్క్ లో ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ సంస్థ సఫ్రాన నెలకొల్పుతున్న సెంటర్‌ను బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ఆన్ లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ కొత్త సదుపాయం ఏరోస్పేస్, రక్షణ రంగంలో తెలంగాణ వృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఇది భారతదేశంలో ాజూ్రా ఇంజిన్‌ల మొట్టమొదటి మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్ (వీ=ూ)సెంటర్ అని తెలిపారు. రూ.1,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ స్థానిక ఎంఎస్‌ఎంఈలకు, ఇంజనీరింగ్ కంపెనీలకు కొత్త వ్యాపార అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఇవాళ సఫ్రాన్‌కు చెందిన ఎమ్88 మిలిటరీ ఇంజిన్ ఎమ్ఆర్‌వోకు కూడా శంకుస్థాపన చేసుకున్నామని వెల్లడించారు. ఈ ఎమ్ఆర్‌వో భారత వైమానిక దళం, భారత నావికాదళానికి ఎంతో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్.. భారతదేశంలోని ప్రధాన ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్ అని పేర్కొన్నారు. తెలంగాణలో 25 కంటే ఎక్కువ ప్రధాన ప్రపంచ కంపెనీలు, 1,500 కి పైగా ఎంఎస్‌ఎంఈలు ఉన్నాయన్నారు. తమ ప్రగతిశీల పారిశ్రామిక విధానం, ఎమ్ఎస్ఎమ్ఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు ప్రముఖ ప్రపంచ కంపెనీల నుంచి అనేక భారీ పెట్టుబడులను ఆకర్షించాయన్నారు. సఫ్రాన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను తయారీ, పరిశోధన, అభివృద్ధి కోసం ఎంచుకున్నాయని సీఎం తెలిపారు.భారతదేశంలోని ప్రముఖ ఎమ్ఆర్‌వో, ఏరో ఇంజిన్ హబ్‌లలో హైదరాబాద్ ఒకటన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగంలో ఎగుమతులు గత ఏడాది రెట్టింపు అయ్యాయన్నారు. 9 నెలల్లో రూ.30,742 కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి తెలంగాణ ఏరోస్పేస్ అవార్డును పొందిందని గుర్తు చేశారు. ఏరోస్పేస్ పెట్టుబడులను ఆకర్షించడానికి నైపుణ్యం చాలా ముఖ్యమైన ప్రమాణమని చెప్పుకొచ్చారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో తెలంగాణ 100 ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్‌లను (ఐటీఐఎస్) అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసిందని చెప్పారు.

## తొలి ఏకగ్రీవ ఎన్నిక నమోదు

రాజన్న సిరిసిల్ల,నవంబర్ 26:
రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజునే తొలి ఏకగ్రీవ ఎన్నిక నమోదు అయింది. రుద్రంగి మండలంలోని రూపులా తండాలో సర్పంచ్ పదవికి జవహర్ లాల్ నాయక్‌ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో అక్కడ ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ఏకగ్రీవ నిర్ణయానికి గ్రామ పెద్దలు, యువత, మహిళలు కలిసి మద్దతు తెలపడంతో పోటీ అవసరమే లేకుండా పోయింది. జవహర్ లాల్ నాయక్ ఏకగ్రీవంగా ఎంపికైన వెంటనే తండా అంతటా టపాసులు కాల్చి వేడుకలు జరుపుకు న్నారు.గ్రామస్థులంతా కలిసి సంబరాలు చేసుకుంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. తన విజయంపై స్పందించిన సర్పంచ్ జవహర్ లాల్ నాయక్.. గ్రామ ప్రజలు చూపిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పంచాయతీ పరిధిలో అభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తండా అభివృద్ధి, ప్రాథమిక సౌకర్యాల మెరుగుదల, ప్రజల కోరికలను నెరవేర్చడం తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.

## హైదరాబాద్‌లో బోర్డు తిప్పేసిన ఐటీ సంస్థ

హైదరాబాద్,నవంబర్25:
హైదరాబాద్ నగరంలో మరో ఐటీ సంస్థ బోర్డు తిప్పేసింది. ఉద్యోగాల పేరిట ఒక్కో విద్యార్థి, నిరుద్యోగి నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసి కంపెనీ డైరెక్టర్ పరారైనట్లు తెలుస్తోంది. మాదాపూర్‌లోని ఎన్ఎస్ఎన్ ఇన్ఫోటెక్ కంపెనీ సుమారు 400 మంది నుంచి డబ్బులు వసూలు చేసింది.రూ.3 లక్షలు చెల్లిస్తే శిక్షణ ఇచ్చి, ఉద్యోగం ఇస్తామని ఈ సంస్థ నమ్మబలికింది. దీంతో వందలాది మంది డబ్బులు చెల్లించారు. విద్యార్థులను మోసం చేసి వసూలు చేసిన డబ్బులతో కంపెనీ డైరెక్టర్ స్వామినాయుడు పరారయ్యాడు. దీంతో బాధితులు సైబరాబాద్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశారు.

## పవర్ ప్రాజెక్టుల్లో రూ.50 వేల కోట్ల

# అవకతవకలు..

ఎన్టీపీసీ చౌక విద్యుత్ ఎందుకు తిరస్కరించారు

పతి నిర్ణయంలో కమీషన్..ఇదే రేవంత్ పాలన"

రేవంత్ ప్రభుత్వంపై మరోసారి హరీష్ రావు కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్,నవంబర్ 26:**
హరీష్ రావు మళ్ళీ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఘాటు విమర్శలు చేశారు. ఇప్పటికే ల్యాండ్ స్కాం బయట పెట్టిన తమ పార్టీ, ఇప్పుడు రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుగుతున్న పవర్ స్కాంను వెలుగులోకి తీసుకురానున్నట్లు ఆయన ప్రకటించారు. అక్షరాల రూ.50 వేల కోట్ల భారీ మోసం జరుగుతోందని, దీనిలో 40 శాతం కమీషన్ తీసుకుంటున్నారని హరీష్ రావు ఆరోపించారు.రాష్ట్రంలో విధాన నిర్ణయాల కోసం నిర్వహించాల్సిన కేబినెట్ సమావేశాలు, ఇప్పుడు పంపకాల కోసం మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశాలు వరుసగా భూ స్కాం, పవర్ స్కాం కోసం జరిగాయని ఆయన విమర్శించారు. తమ పార్టీ ఇప్పటికే రూ.5 లక్షల కోట్ల ల్యాండ్ స్కాం ను బయట పెట్టినా, ప్రభుత్వం దానిపై ఒక్క సమాధానం కూడా చెప్పలేదని హరీష్ రావు మండిపడ్డారు. రామగుండం, పాల్వంచ, మక్తల్ పవర్ ప్లాంట్లలో రూ.50 వేల కోట్ల భారీ అవకతవకలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. "రేవంత్ ప్రభుత్వం చేసే ప్రతి పనిలో ఒక మిషన్ ఉంటుంది.. ఆ మిషనే కమిషన్" అని వ్యాఖ్యానిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలలో ప్రజల ప్రయోజనం కంటే స్వప్రయోజనాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అరాచకం రాజ్యమేలుతుందని కేసీఆర్ గతంలో చెప్పిన విషయం ఇప్పుడు నిజమవుతోందని హరీష్ వ్యాఖ్యానించారు. వాటాల విషయంలో తలెత్తిన అంతర్గత తగాదాల వల్ల మంత్రులే రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తే వెంటనే డర్టీ పాలిటిక్స్‌కు తెర తీస్తున్నారని ఆరోపించారు.ఎన్టీపీసీ తక్కువ ధరకే విద్యుత్ అందించేందుకు సిద్ధంగా లేఖ రాసినా, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఎందుకని ప్రశ్నించారు. ఎన్టీపీసీ ప్రతిపాదనను ఎందుకు తిరస్కరించారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దామరచర్లలో పవర్ ప్లాంట్ నిర్మాణంపై గతంలో తీవ్రంగా విమర్శించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. "కమీషన్ కోసమే కోమటిరెడ్డి పెదవులు మూసుకున్నారా?" అని హరీష్ వ్యంగ్యంగా ప్రశ్నించారు. పథకాల అమలుకు డబ్బుల్లేవని ప్రభుత్వం చెప్పుకుంటూనే, వేల కోట్లతో 2,400 మెగావాట్ల పవర్ ప్లాంట్లను డబుల్ కాస్ట్‌తో నిర్మించడం అంటే కమీషన్ల కోసం చేస్తున్న ప్రాజెక్టులేనని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రతి రోజు తన మాటలను మార్చుకుంటారని, 'రామ్-రెమో' లెక్క రోజుకో కొత్త కథ చెబుతున్నారని హరీష్ వ్యాఖ్యానించారు.

## కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం

**- దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అడుగులు**

**- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్విని వైష్ణవ్**

న్యూఢిల్లీ,నవంబర్26 :
దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా కేంద్ర కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ ఒకేసారి నాలుగు ప్రధాన నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశంలో అరుదైన-భూమి అయస్కాంతాల దేశీయ ఉత్పత్తిని ప్రోత్స హించడం అత్యంత ముఖ్య మైన నిర్ణయం తీసుకుంది మోదీ సర్కార్. అలాగే మహారాష్ట్ర-గుజరాత్ ప్రజలకు ప్రత్యేక బహుమ తులు సహా మొత్తం రూ. 19,919 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ నిర్ణయాలను ప్రకటించారు. అరుదైన భూమి అయస్కాంతాలతో పాటు, ప్రభుత్వం రెండు కీలక రైల్వే ప్రాజెక్టులను కూడా ఆమోదించింది. ముంబై సమీపం లోని బద్లాపూర్-కర్జాత్ లైన్, గుజరాత్‌లోని ద్వారకా లైన్ లకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు దేశవ్యాప్తంగా కనెక్టివిటీ గురించి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. ఈ ప్రాజెక్టులు లక్షలాది మంది ప్రయాణి కులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తాయి. ప్రయాణ సమ యాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. అత్యధిక బడ్జెట్ కలిగిన పూణే మెట్రోకు కేంద్రం రూ. 9,858 కోట్లు గ్రాంట్‌ను అందించనున్నారు. 32 కిలోమీటర్ల కొత్త లైన్ వేయడానికి వీలు కల్పించింది కేంద్రం.ఈ మార్గం ఖరడి నుండి ఖడక్వాస్లా వరకు, నల్ స్టాప్ నుండి మాణిక్ బాగ్ వరకు నడుస్తుంది. ఇది పూణే మెట్రో నెట్‌వర్క్‌ను 100 కిలోమీటర్లకు పైగా విస్తరిస్తుంది. ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బంది పడుతున్న పూణే నివాసితులకు ఇది ఒక పెద్ద ఉపశమనం. భవిష్యత్ సాంకేతిక తను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం అరుదైన భూమి శాశ్వత మాగ్నెట్ పథకాన్ని ఆమోదించింది. దీని కోసం రూ. 7,280 కోట్ల బడ్జెట్ కేటాయించింది.

## రైతులను నిర్లక్ష్యం చేస్తున్న చంద్రబాబు

**పులివెందులలో అరటి తోటల్లో పర్యటించిన జగన్**

**అరటి ధరలు పతనమై రైతులు తీవ్ర నష్టాల్లోకి**

**కూటమి ప్రభుత్వాన్ని రైతు సంక్షోభంపై తీవ్రంగా విమర్శించిన వైసీపీ అధినేత**

అమరావతి,నవంబర్ 26 :
ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఈ నిర్లక్ష్యం కారణంగా ఆయనకు రైతుల ఆగ్రహం తప్పదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. పులివెందుల నియోజకవర్గంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో అరటి తోటలను పరిశీలించిన అనంతరం ఆయన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో అరటి పంట పరిస్థితి దారుణంగా మారిపోయిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో ముందంజలో ఉన్న ఆంధ్రప్రదేశ్ నేడు దిగజారిపోయిందని ఆయన ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో అరటి పంట టన్నుకు రూ.30 వేలు లభించగా, ప్రస్తుతం కూటమి హయాంలో రూ.2 వేలు కూడా లభించడం లేదని రైతుల పరిస్థితిని వివరించారు. గత 17 నెలల టీడీపీ కూటమి



పాలనలో వరుసగా 16 విపత్తులు సంభవించినప్పటికీ, రైతులకు కనిష్ట సహాయం కూడా అందించలేదని జగన్ విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకంలో రూ.40 వేలు ఇస్తామని హామీ ఇచ్చి, రూ.10 వేలు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం వెనక్కు తగ్గిందని మండిపడ్డారు. దీని వలన రైతుల సమస్యలు మరింతగా పెరిగాయని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో వారు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారని, కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పూర్తిగా అపేక్షిస్తోందని జగన్ తీవ్రంగా అభియోగపెట్టారు. రైతుల పక్షాన వైసీపీ పోరాటం కొనసాగుతుందని, వారి సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కు తగ్గబోమని ఆయన స్పష్టం చేశారు.

## హాంగ్‌కాంగ్‌లోని భారీ అగ్ని ప్రమాదం

**35 అంతస్తుల భవనంలో మంటలు**

**13 మంది దుర్మరణం**

**హాంగ్‌కాంగ్,నవంబర్26:**
హాంగ్‌కాంగ్‌లోని 35 అంతస్తుల హౌసింగ్ కాంప్లెక్స్‌లో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో 13 మంది మృతి చెందారు. మరికొందరు మంటల్లో చిక్కుకున్నట్లు సమాచారం. సంఘటన స్థలంలోనే తొమ్మిది మంది మరణించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం నుంచి బయటపడిన హౌసింగ్ కాంప్లెక్స్‌లోని వందలాది మందిని తాత్కాలిక ఆశ్రయాలకు తరలించారు. థాయ్‌పో జిల్లాలోని ఆకాశహర్మ్యాల్లో బుధవారం మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాప్తి చెంది ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఆ నివాస సముదాయంలో సుమారు 2,000 ఇళ్లు ఉన్నాయని, అందులో కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనను 4వ నెంబరు ప్రమాదంగా అధికారులు ప్రకటించారు. అత్యయిక పరిస్థితి ప్రకటించినప్పుడు భారీస్థాయిలో ఫైరింజన్లు, సిబ్బందిని మోహరించవలసి ఉంటుంది.

ఈ నివాస సమదాయంలో దాదాపు 4,800 మంది నివసిస్తు న్నారు. 128 అగ్నిమా పక వాహనాలు, 57 అంబులెన్సులను ఘటనా స్థలానికి తరలించారు. మంటల్లో చిక్కుకున్న వారిలో వృద్ధులు అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# గొప్ప మనసు చాటుకున్న వెనిగళ్ళ ఆనందప్రసాద్,కృష్ణ కుమారి దంపతులు

## సొంత గ్రామానికి ఐదు కోట్ల నిధులు వెచ్చించి దాతృత్వం చాటిన వేనిగళ్ళ దంపతులు

## పుట్టి పెరిగిన గ్రామ అభివృద్ధికి తోడ్పాటు






**బయ్యారం,తోవ్వ,నవంబర్ 26**
పుట్టి పెరిగిన గ్రామాన్ని,తల్లిదండ్రులను మరిచిపోతున్న ఈ రోజుల్లో తన గ్రామానికి ఏదో చేయాలని తపనతో కోట్లకు పడగలెత్తినా తన గ్రామానికి ఐదు కోట్ల నిధులను వెచ్చించి గ్రామ ప్రజల అభివృద్ధికి ఉపయోగపడేలా చేసిన వెనిగళ్ళ ఆనందప్రసాద్,కృష్ణ కుమారి దంపతులు. వివరాల్లోకి వెళితే బయ్యారం మండలానికి చెందిన సత్యనారాయణపురం గ్రామపంచాయతీకి చెందిన వెనిగళ్ళ ఆనందప్రసాద్ తన బాల్యంలో కొత్తపేట గంధంపల్లి పంచాయతీ పరిధిలో ఉన్నత పాఠశాలలో పదోతరగతి వరకు విద్యనాభ్యసించి హైదరాబాద్ లో సెటిల్ అయి సొంత గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయంగా 5 కోట్ల నిధులను వెచ్చించి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు సహాయపడుతున్నారు.వాటిలో భాగంగా సత్యనారాయణపురం గ్రామ సమీపంలో వెనిగళ్ళ ఆనందప్రసాద్ తన తండ్రి వెనిగళ్ళ జగ్గయ్య జ్ఞాపకార్థం 4 కోట్ల 60 లక్షల నిధులతో భారీ ఎత్తున ఫంక్షన్ హాల్ నిర్మాణం చేసి గ్రామానికి ఉపయోగపడేలా సహకరించారు.గతంలో గంధంపల్లి పంచాయతీ పరిధిలో రామాలయం పునర్నిర్మాణానికి 25 లక్షల నిధులను వెచ్చించి ఆలయ అభివృద్ధికి తొడ్పాటు అందించారు.

దీనితో తన గ్రామానికి సుమారుగా ఐదు కోట్లను వెచ్చించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.ఇలాంటి మహనీయులు ఊరుకు ఒక్కరు ఉంటే చాలని ప్రజలు చర్చించుకుంటున్నారు. బుధవారం గంధంపల్లి పంచాయతీ పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు సమావేశ వేదిక నిర్మాణానికి 25 లక్షల రూపాయల విరాళము ప్రకటించి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్,కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గడ్డం సురేష్,పెండ్యాల శివయ్య ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి పాటుపడుతున్న వెనిగళ్ళ ఆనందప్రసాద్,కృష్ణకుమారి దంపతులకు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్ర ంమంలో సురేష్,బాలరాజు, అన్నపూర్ణ, రామ్మూర్తి, రాఘపతి, రవి,శ్రీను,సతీష్,కోటేశ్వరరావు,వెంకటేశ్వరావు,దుర్గ రావు,తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శం..

## లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి



**తొవ్వ,నవంబర్ 26, చౌటుప్పల్:**
భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు సందర్భంగా లాయర్స్ ఫోరం పర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పత్రిక ప్రకటన విడుదల చేశారు ఈ సందర్భంగా లాయర్స్ పోరం పర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది మాట్లాడుతూ న్యాయవాదిగా అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు మొదలుకొని వివిధ కోర్టులో కేసులను రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు కేసులను వాదించడం చాలా సంతోషకరం. భారత రాజ్యాంగానికి నాయకత్వం వహించిన బిఆర్ అంబేద్కర్ ఒక న్యాయవాది కావడం గర్వకారణం వారు సుమారుగా మూడు సంవత్సరాలు శ్రమించి రచించిన రాజ్యాంగం నేడు అనేకమంది బడుగు బలహీన వర్గాలని ఉన్నత పదవులను అధిరోహించడంలో కీలకంగా పనిచేస్తుంది మనం కొన్ని ఉదాహరణగా తీసుకున్నట్లయితే ఒక చాయవాల గౌరవ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి కాగలిగారు ఒక గిరిజన మహిళ ద్రౌపది మురుము గౌరవ భారత రాష్ట్రపతి అయ్యారు అనేకమంది ఉన్నతమైన రాజ్యాంగబద్ధమైన పదవులలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో లిఖించిన అతిపెద్ద భారత రాజ్యాంగం వలనే సాధ్యమైంది అదేవిధంగా బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు ఏర్పాట్లు చేయడంలో కీలక భూమిక పోషించిన భారత రత్న డాక్టర్ బీసీ రిజర్వేషన్లు ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని తెలియజేశారు భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు సందర్భంగా భారత రాజ్యాంగాన్ని రచించడంలో కీలక భూమిక పోషించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మొదలుకొని ఆ కమిటీ సభ్యులందరికి వందనాలు సమర్పిస్తూ వారిని స్పందించుకోవడం చాలా గర్వకారణం అన్నారు రాబోయేటటువంటి రోజుల్లో యువత భారత రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకొని అనేక విజయాలను అందుకోవాలని తెలియజేస్తున్నామన్నారు.

# నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


**- నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు - 27 నుంచి 29 వరకు నామినేషన్ల స్వీకరణ - తొర్రూరు ఆర్డీవో గణేష్**



**తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 26**
రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో తొర్రూరు ఆర్డీవో గణేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని 31 గ్రామపంచాయతీలకు సర్పంచ్, 280వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 27 నుంచి 29 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు మండలంలో 9 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల వివరాలను వెల్లడించారు. నైనాల గ్రామపంచాయతీలో, జామ తండా, రత్తి రామ్ తండా, నల్లగుట్ట తండా, హనుమాన్ నగర్ తండాలో, రాజులకొత్తపల్లి, సీతారాంపురం, పార్వతమ్మ గూడెం లో రావిరాల, దుర్గ భవాని తండా, వసరం తండా, మునిగలవీడులో, శ్రీరామ గిరి, మదన తుర్తి, నరసింహుల గూడెంలో కాస్య తండా, బంజర, హేమ్లతండా, వావిలాల లో ఆలేరు బోటీ మీద తండ, రాజ్య తండా, ఎర్రబెల్లి గూడెం, లోకాచీకల్, బడి తండా, మేచరాజుపల్లిలో పెద్ద తండా, సౌల తండా, నెల్లికుదురులో బ్రాహ్మణ కొత్తపల్లి రామన్నగూడెం నామినేషన్ కేంద్రాల్లో నామినేషన్లనుస్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మండలంలోని నైనాలలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఇద్దరి కంటే ఎక్కువగా తిరగరాదని, అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట స్థానిక తహసిల్దార్ చందా నరేష్, ఎంపీడీవో సింగారం కుమార్, ఎస్సై చిర్ర రమేష్ బాబు, సంబంధిత శాఖల అధికారులు తదితరులున్నారు.

## బీరవెల్లి వారి వివాహ మహోత్సవ వేడుకకు హాజరైన దామరకొండ - సమ్మి గౌడ్ చిలువేరు

**కేసముద్రం,నవంబర్ 26,తొవ్వ:**
కేసముద్రం మాజీ మార్కెట్ చైర్మన్ బీరవెల్లి ఉమా-భరత్ కుమార్ రెడ్డి ల కుమార్తె భార్గవ రెడ్డి వివాహం వరుడు హృదయ్ కుమార్ రెడ్డిలి తో హనుమకొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్ రాంపూర్ లో జరగగా ఈ వివాహ మహోత్సవ వేడుకకు గోపా డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్,దామర కొండ ప్రవీణ్,ఎర్రంశెట్టి అశోక్ లు హాజరై నూతన వధూవరులను వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆ దేవుడి ఆశీస్సులు వారిపై మెండుగా ఉండాలని వధూవరులను అక్షంతలు వేసి ఆశీర్వదించారు.



# ఎంజేపీ గురుకులంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

## ప్రజల మహోన్నత శక్తి రాజ్యాంగం ప్రిన్సిపాల్ బి.స్రవంతి




**పఠాన్ చెరు,నవంబర్, 26**
పటాన్ చెరు, బీసీ గురుకుల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, బాలుర కళాశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ బి. స్రవంతి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ, హక్కులు, అవకాశాలు, అనగారిన వర్గాలకు రిజర్వేషన్లు లభించడానికి కారణం రాజ్యాంగం అని ప్రజల మహోన్నత శక్తి రాజ్యాంగమే అని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి మన రాజ్యాంగం గురించి తెలుసు కోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ డిపార్ట్ మెంట్,ఏటీపీ రేఖలక్ష్మి, సముద్రల స్వప్న, వడ్డె సురేష్, నజీరొద్దీన్, నర్సింలు, నరసింహ రావు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో కండక్టర్ పై దాడి




**నర్సంపేట, నవంబర్ 26, తొవ్వ న్యూస్:**
హైదరాబాద్.నుండిమహబూబాబాద్ కు వస్తున్న ఆర్టిసి బస్సు వరంగల్ చేరుకున్న తర్వాత ఇద్దరు ప్యాసింజర్ లు దొంతి రాంరెడ్డి, దొంతి లక్ష్మరెడ్డి లు నర్సంపేట కు టికెట్ తీయనుకోని బస్సు ఎక్కారు. నర్సంపేట బస్సు స్టాప్ వచ్చాక డ్రైవర్ కం కండక్టర్ చీకటి వెంకటయ్య పైన పేర్కొన్న ఇద్దరిని బస్సు దిగమని చెప్పక బస్సు దిగాము అని చెప్పడమే కాకుండా డ్రైవర్ వెంకటయ్య ను అసభ్య కరంగా తిట్టి కొట్టడంతో వెంకటయ్య పిర్యాదు మేరకు ఇద్దరి పై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్ కు పంపనైనది.

# బయ్యారంలో ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలు



**బయ్యారం,తోవ్వ,నవంబర్ 26**
బయ్యారం మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయంలో బుధవారం సుబ్రహ్మణ్యస్వామి షష్టి వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు సుదర్శన చార్యులు ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాలతో అభిషేకాలు,ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డాక్టర్ కృష్ణా రెడ్డి,సెక్రటరీ కొల్లా వెంకటేశ్వరావు, పెద్దినేని వెంకటేశ్వరరావు,వైఎస్ రెడ్డి,తిరుపతి రావు,పూసులూరి మాధవరావు,సత్తి బాబు, గరిపల్లి శ్రీనివాస్,మహిళ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# జై భీమ్ సేన ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం

**యాదాద్రి జిల్లా:వలిగొండ: తొవ్వ ప్రతినిధి: నవంబర్ 26**



వలిగొండ మండల పరిధిలోని గోపరాజుపల్లి గ్రామంలో బుధవారం జై భీమ్ సేన ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా జై భీమ్ సేన అధ్యక్షులు వల్లమల్ల రత్నయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాలకు హక్కులు, రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సంగిశెట్టి సుందర్ రావు, ఉపాధ్యక్షులు కట్ట సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నీలం నరేందర్, జాయింట్ సెక్రెటరీ సంగిశెట్టి రమేష్, కల్చరల్ సెక్రెటరీ నీలం నరేష్, కారోబార్ వనం జనార్ధన్, బిక్షపతి, నర్సయ్య, మత్స్యగిరి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక సీఎంపై సంక్షోభం: నేను, సోనియా, రాహుల్ కలిసి పరిష్కరిస్తాం : ఖర్గే

**ఉపముఖ్యమంత్రికి మద్దతుగా ఎమ్మెల్యేల ఢిల్లీ మకాం**

**అధిష్ఠానం నిర్ణయమే తుది ఫలితం అని స్పష్టం**



**న్యూఢిల్లీ, 26 నవంబర్ 2025:**
కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవి చుట్టూ నెలకొన్న వివాదాన్ని ఎట్టకేలకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగంగా అంగీకరించారు. సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోందని పేర్కొన్న ఆయన, “నేను, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కలిసి ఈ సమస్యకు త్వరలోనే ముగింపు పలుకుతాం” అని ప్రకటించారు. 2023 ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిని చెరో రెండు సంవత్సరాలుగా పంచుకునే ఒప్పందం జరిగిందనే ప్రచారం నేపథ్యంలో ఈ ఉద్రిక్తత ముదిరింది. ఆ గడువు సమీపిస్తున్న వేళ శివకుమార్ వర్గానికి చెందిన పలు ఎమ్మెల్యేలు ఢిల్లీ చేరుకుని అధిష్ఠానంపై ఒత్తిడి పెంచుతున్నారు. వారిలో ఒకరైన ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్, “డీకే శివకుమార్ 200 శాతం ముఖ్యమంత్రి అవుతారు” అని ధీమా వ్యక్తం చేయడం రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. ఈ పరిణామాలపై శివకుమార్ జాగ్రత్తగా స్పందిస్తూ, పార్టీకి ఇబ్బంది కలిగించేలా పబ్లిక్ స్టేట్‌మెంట్లు చేయనని తెలిపారు. అయితే రాజకీయ ఆశలు కలిగి ఉండటంలో తప్పులేదని వ్యాఖ్యానించారు. మరోవైపు సీఎం సిద్ధరామయ్య, “అధిష్ఠానం నిర్ణయమేఅంతిమం. ఈ పరిస్థితికి తెరదించాల్సిన బాధ్యత హైకమాండ్‌దే” అని స్పష్టం చేశారు. ఇకపోతే, కొన్ని రోజుల క్రితం వరకు పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, ఇవన్నీ బీజేపీ ప్రచారమే అని కాంగ్రెస్ ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా పేర్కొన్నారు. డిసెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందు ఈ వివాదానికి పరిష్కారం వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. రానున్న 48 గంటల్లో ఖర్గే-రాహుల్ భేటీ జరిగి, తదనంతరం రెండు వర్గాల నేతలను ఢిల్లీకి పిలిపించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ఢిల్లీలో తీవ్రమవుతున్న వాయు కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేసిన సీజేఐ సూర్యకాంత్

**వాకింగ్‌కు వెళ్లిన సమయంలోనే శ్వాస సమస్య ఎదురైందని వ్యాఖ్య**

**వర్చువల్ హియరింగ్‌పై సుప్రీంకోర్టులో చర్చ**

**పర్యావరణ శాఖ కీలక ఆదేశాలతో వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు**




**న్యూఢిల్లీ 26 నవంబర్:**
ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకు ప్రమాదకరస్థాయికి చేరుకుంటు ఒడటంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఒక గంట పాటు బయట నడవడానికి వెళ్లినప్పుడు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన వెల్లడించారు. రాజధానిలో గాలి నాణ్యత తీవ్రంగా పడిపోవడం వల్ల ప్రజారోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతోందని ఆయన వ్యాఖ్యానించారు. వాయు కాలుష్య పరిస్థితుల నేపథ్యంలో వయోవృద్ధ న్యాయవాదులకు వర్చువల్ విధానంలో విచారణలకు హాజరయ్యే అవకాశం ఇవ్వాలని సీనియర్ న్యాయవాదులు రాకేష్ ద్వివేది, కపిల్ సిబల్ కోర్టును కోరారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అంగీకరిస్తే, విచారణలను వర్చువల్ మోడ్‌లో నిర్వహించేందుకు ఏకరీతి నియమాలు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని సీజేఐ చెప్పారు. గత రెండు వారాలుగా గాలి నాణ్యత సూచీలు ప్రమాద స్థాయికి పడిపోతున్న నేపథ్యంలో కోర్టు ముందే న్యాయవాదులను అప్రమత్తం చేసింది. సుప్రీంకోర్టు ధర్మాసనం, తీవ్రమైన కాలుష్యంలో న్యాయవాదులు కోర్టుకు వ్యక్తిగతంగా రావాల్సిన అవసరం లేదని, వారికి వర్చువల్ హియరింగ్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించింది. ప్రధాన న్యాయమూర్తితో చర్చించి, వాయు కాలుష్య పరిస్థితులకు అనుగుణంగా మరిన్ని మార్గదర్శకాలు ఇచ్చే అవకాశం ఉందని ధర్మాసనం తెలిపింది. న్యాయవాదుల్లో 60 ఏళ్లు పైబడిన వారికి ఈ పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా ఉన్నాయని కోర్టులో స్పష్టమైంది. ఇక పరిస్థితి తీవ్రరూపం దాల్చడంతో ఢిల్లీ పర్యావరణ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులలో సగం మంది ఇంటి నుంచే పనిచేయాలని ఆదేశించింది. పర్యావరణ పరిరక్షణ చట్టంలోని నిబంధనల ప్రకారం ఈ ఆదేశాలు జారీ కాగా, వాయు కాలుష్యం ప్రభావం తగ్గేదాకా ఈ చర్యలు కొనసాగనున్నాయని అధికారులు తెలిపారు.

# సీనియర్ అధికారి అంటూ ప్రజలను మోసగించిన శశికాంత్ అరెస్ట్

**నకిలీ గుర్తింపు కార్డులతో భారీ మోసం**

**బాడీగార్డ్‌లు, సైరన్‌లతో అధికారి వేషధారణ**

**పది లక్షలకు పైగా వసూలు చేసి పరారైపోయిన నిందితుడిని పట్టివేత**



**హైదరాబాదు, 26 నవంబర్ :**
సీనియర్ ప్రభుత్వ అధికారి అని నటిస్తూ రెండు సంవత్సరాలుగా ప్రజలను మోసం చేస్తున్న బతిని శశికాంత్ అనే నిందితుడిని ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. డిప్యూటీ కమిషనర్, మైన్స్ అధికారి, మరికొన్ని సందర్భాల్లో పోలీసు ఉన్నతాధికారి వేషంలో ప్రజలను నమ్మబలికి వారికి భారీ నష్టం కలిగించినట్లు విచారణలో తేలింది. నిందితుడు నకిలీ గుర్తింపు కార్డులు, నకిలీ పత్రాలు తయారు చేసి ప్రజలను మోసపుచ్చేవాడని పోలీసులు తెలిపారు. ఇద్దరు బాడీగార్డ్‌లను ఆయుధాలతో అద్దెకు తీసుకోని తనను ఉన్నతస్థాయి అధికారిగా చూపించుకున్నాడు. ప్రైవేట్ వాహనానికి సైరన్ అమర్చడం, వాకీ-టాకీలను ఉపయోగించడం వంటి చర్యల ద్వారా అధికారుల మాదిరిగా ప్రవర్తించి ప్రజల్లో నమ్మకం కలిగించేవాడు. పరిశ్రమల భూమి కేటాయింపు పేరుతో నకిలీ పత్రాలు తయారు చేసి వ్యక్తులను మోసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ పద్ధతుల ద్వారా శశికాంత్, భూమి కేటాయింపు పేరుతో పది లక్షలకు పైగా మొత్తం వసూలు చేసి తరువాత పరారైపోయాడు. విశ్వసనీయ సమాచారంతో 25 నవంబర్ న ఫిల్మ్‌నగర్ పోలీసులు శశికాంత్‌ను షేక్‌పేట్ ప్రాంతంలో ఉన్న తాత్కాలిక నివాసం నుంచి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడితో పాటు అతడికి సహకరించిన మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, వాకీ-టాకీలు మరియు నకిలీ గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఇలాంటి మోసకారి వ్యక్తుల నమ్మకానికి లోనుకాకుండా అనుమానాస్పద సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని నగర పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారం

**నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ**

**సోషల్ మీడియాలో వ్యక్తిగత దాడులపై ఆవేదన**

**మాగంటి గోపీనాథ్‌పై కేసు వెనక్కి తీసుకున్నట్టు వెల్లడి**



**హైదరాబాద్, 26 నవంబర్ :**
జూబ్లీహిల్స్ నియోజకవర్గం నూతన ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్ ఈరోజు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ చేత ఆయన ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ రాజ్యాంగ దినోత్సవం రోజున ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించడం తనకు ప్రత్యేక గౌరవమని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి తన ప్రాధాన్యత అని, ఎన్నికల సమయంలో చేసిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా, పారదర్శకంగా పనిచేయడం లక్ష్యమని తెలిపారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో తనతో పాటు కుటుంబ సభ్యులపై వ్యక్తిగత దాడులు జరుగడం బాధ కలిగించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌పై తాను వేసుకున్న కేసును వెనక్కి తీసుకున్నట్టు చెప్పారు. ఆ కేసు విచారణ దశలో ఉండగానే గోపీనాథ్ మరణించారని, ఆయన ఉన్నా లేకపోయినా జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక తప్పదని పేర్కొన్నారు. ఉప ఎన్నికలో మద్దతు అందించిన ఎంఐఎం పార్టీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్ విజయం కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచిందని, ఈ నమ్మకాన్ని నిలబెట్టడం తన బాధ్యత అని నవీన్ యాదవ్ అన్నారు.

# నల్లగొండ-మహబూబ్‌నగర్ రహదారి విస్తరణకు శంకుస్థాపన

**రూ.50 కోట్లతో నాలుగు వరుసల రహదారి**

**ధర్వేశిపురం-నాగార్జునసాగర్ రోడ్ వరకు అభివృద్ధి**

**ప్రజల రాకపోకలకు భారీగా లాభం**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



**నల్లగొండ, 26 నవంబర్ :** నల్లగొండ పట్టణంలో ధర్వేశిపురం నుండి నాగార్జునసాగర్ రోడ్ వరకు మహబూబ్‌నగర్-నల్లగొండ ప్రధాన రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించి బలోపేతం చేసే పనులకు శంకుస్థాపన చేయబడింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రహదారి అభివృద్ధి ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందని పేర్కొన్నారు. రూ.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ రహదారి విస్తరణ ప్రాజెక్ట్ నల్లగొండ నగర పరిసరాల్లో రవాణా ఒత్తిడిని తగ్గించడాన్ని లక్ష్యంగా పెట్టుకుని రూపొందించబడింది. రోజూ భారీ వాహనాలతో నిండిపోయే ఈ మార్గం, విస్తరణ అనంతరం మరింత సురక్షితంగా మారనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రోడ్డుపై ప్రయాణం ప్రజలకు ఇబ్బందులను కలిగిస్తున్నప్పటికీ, కొత్తగా నాలుగు వరుసల మార్గం సిద్ధమైతే రాకపోకలు వేగంగా, సజావుగా సాగనున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని వ్యాపార కార్యకలాపాలు, వాహనాల తరలింపు, అత్యవసర సేవలు మరింత సులభతరంగా మారనున్నాయి. పట్టణాభివృద్ధిలో రహదారుల ప్రాధాన్యం ఎంతో కీలకమని, నల్లగొండను రవాణా హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఇలాంటి ప్రాజెక్టులు మరింత వేగవంతం చేయనున్నట్లు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని శ్రేయోభిలాషి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన చెప్పారు.

# ప్రియురాలు మోసం చేసిందన్న ఆవేదనతో ఇన్ఫోసిస్ ఉద్యోగి ఆత్మహత్య

**పెళ్లి ఆశతో ప్రేమలో ఉన్న పవన్‌కల్యాణ్ రెడ్డి**

**మరో వ్యక్తితో ప్రియురాలి ఫోటోలు చూసి తీవ్ర మనస్తాపం**

**పోచారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం**

**హైదరాబాద్, 26 నవంబర్:** ప్రేమించిన యువతి మోసం చేసిందన్న భావోద్వేగ ఆవేదనతో హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్ఫోసిస్‌లో పనిచేస్తున్న పవన్‌కల్యాణ్ రెడ్డి (26), సోమవారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని జీవితాన్ని ముగించుకున్నాడు. గుంటూరు జిల్లాకు చెందిన పవన్, పోచారంలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో స్నేహితులతో అద్దె ఇంట్లో నివసిస్తూ నలుగురేళ్లుగా ఇన్ఫోసిస్‌లో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఒక యువతితో ప్రేమలో ఉన్న అతను, పెళ్లి ఆశతో ఆమెతో వ్యక్తిగతంగా దగ్గరైనట్లు సమాచారం. అయితే ఇటీవల ఆ యువతి మరొక వ్యక్తితో ఉన్న ఫోటోలు చూసిన పవన్‌కల్యాణ్ తీవ్ర అనుమానం వ్యక్తం చేసి మానసిక ఆందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో పవన్ ఆ ఫోటోలను యువతి కుటుంబ సభ్యులకు పంపించడంతో, ఆ యువతి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. రెండు రోజులుగా ఆమె ఫోన్‌కాల్‌లకు స్పందించకపోవడం, వ్యక్తిగతతగా దూరం కావడం పవన్‌ను మరింత మానసిక ఒత్తిడికి గురిచేసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకోవడానికి అతను ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్నేహితుల సమాచారం మేరకు హైదరాబాద్‌కు చేరుకున్న పవన్ తండ్రి శ్రీనివాస్ రెడ్డి, తన కుమారుడి ఆత్మహత్యకు కారణం ప్రియురాలి మోసమే అని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును స్వీకరించిన పోచారం ఐటీ కారిడార్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. యువకుడి ఆత్మహత్య నేపథ్యం, వ్యక్తిగత సంబంధాలు, ఇటీవల జరిగిన వాదోపవాదాలపై పోలీసులు అదనపు వివరాలు సేకరిస్తున్నారు.

# డీసీసీ అధ్యక్షుడు ఆయూబ్‌కు ఘనంగా సన్మానం

**నర్సంపేట, నవంబర్ 26, తొవ్వ న్యూస్:**



వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా నూతనంగా ఎన్నికైనమహ్మద్ ఆయూబ్ ను బుధవారం శాలువా, బొకే తో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రానికి చెందిన డీసీసీ అధ్యక్షులు ఆయూబ్ కాంగ్రెస్ పార్టీ లో చేరిన నాటి నుండి నేటి వరకు క్రమ శిక్షణ గల కార్యకర్తగా పనిచేసినందున ఈ రోజు ఈ పదవి లభించిందన్నారు. ఈ కార్యక్రమంలోజిహెచ్ఎంసి మాజీ కార్పొరేటర్ కేడల పద్మ,పిఏసిఎస్ చైర్మన్ కేడల జనార్ధన్, ఓబీసీ జిల్లా నాయకులు బండారి జనార్ధన్ గౌడ్, కర్ర కుమార్, దామేరకొండ కర్ణాకర్, కలకోట రమేష్, కానుగంటి పద్మావతి,బక్కి కల్పన అంబటి రమాదేవి, వనం లావణ్య,ఉప్పు నూతుల శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి పెట్టాలి

**మహబూబాబాద్ జిల్లాఎస్పీ డాక్టర్ శబరీష్**

**జిల్లా పరిధిలోని కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు పోలీస్ స్టేషన్ ల సందర్శన**

**తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 26**
స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా మండలాల్లోని సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక దృష్టి పెట్టాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ సంబంధిత మండలాల ఎస్ హెచ్ ఓ లను ఆదేశించారు. బుధవారం ఆయన కేసముద్రం సీఐ సత్యనారాయణ తో కలిసి సర్కిల్ పరిధిలోని మండలాల పోలీస్ స్టేషన్లను సందర్శించారు ఈ సందర్శనలో భాగంగా కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరల గురించి యూ.ఐ,పెండింగ్ కేసులు, మర్డర్ కేసులు, దొంగతనాలు ఇతర వివరాలు ఎస్.ఐ క్రాంతి కిరణ్ ను అడిగి తెలుసుకున్నారు . బౌగోలిక మ్యాప్ ద్వారా మండల పరిధిలో ఎన్ని గ్రామ పంచాయితీలు ఉన్నాయి అని వివరాలతో పాటు. సమస్యాత్మక గ్రామాల గురించి అడిగి శాంతియుతంగా గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగేలా చూసుకోవాలని అన్నారు.గ్రామపంచాయితీ ఎన్నికల దృష్యా అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాల వివరాలు వాటి పనితీరు తెలుసుకున్నారు. ఇనుగుర్తు సరిహద్దు చెక్ పోస్ట్ వివరాలు అడిగారు. కొత్తగా ఏర్పడిన పోలీస్ స్టేషన్ కాబట్టి ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా విధులు నిర్వహిస్తు ఎల్లపుడు అందుబాటులో ఉండాలన్నారు. నెల్లికుదుర్ పోలీస్ స్టేషన్ సందర్శించి ఎన్నికల సమయంలో సమస్యలు, సమస్యాత్మక ప్రాంతాల పై దృష్టి సారించాలన్నారు. సిబ్బందితో మాట్లాడి వారికీ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి అన్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వాహించాలని అన్నారు. వారి వెంట కేసముద్రం సీఐ సత్యనారాయణ, కేసముద్రం ఎస్.ఐ కనుకుల క్రాంతి కిరణ్, ఇనుగుర్తి ఎస్.ఐ కరుణాకర్, నెల్లికుదురు ఎస్.ఐ చిర్రా రమేష్ బాబు సిబ్బంది పాల్గొన్నారు.




# కార్మికుల హక్కుల పరిరక్షణ కొరకు మజ్దూర్ యూనియన్ నిరంతర పోరాటం

**మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ యుగంధర్ యాదవ్**

**గార్ల నుండి మహబూబాబాద్ వరకు కొనసాగిన కార్మిక సంకల్ప యాత్ర**

**కార్మికుల గుండె చప్పుడు విన్న మజ్దూర్ యూనియన్ నాయకులు**






**తొవ్వ, ప్రతినిధి. నవంబర్ 26:** కార్మికుల హక్కుల పరిరక్షణ కొరకు మజ్దూర్ యూనియన్ నిరంతర పోరాటం చేస్తుందని మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ యుగంధర్ యాదవ్ అన్నారు. బుధవారం.మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్మిక సంకల్ప యాత్ర గార్ల, గుండ్రాతి మడుగు, మహబూబాబాద్ రైల్వే స్టేషన్ లలో నిర్వహించారు ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు యూనియన్ నాయకుల దృష్టికి తీసుకుని వచ్చారు పెట్రోలింగ్ హాట్స్, టూల్ రూముల నిర్మాణం చేపట్టాలని మహబూబాబాద్ లో రైల్వే క్వాటర్స్ నిర్మాణం త్వరగా పూర్తి చేసి కార్మికులకి అందజేశాలని, వేసవి కాలంలో మంచినీటి వసతి కొరకు బోర్ వెల్స్ వేయించాలని కోరారు. గుండ్రాతి మడుగు లో పని చేస్తున్న కార్మికులకు స్వంత ఇంటి చేరువలో ట్రాన్సఫర్ సౌకర్యం కల్పించాలని, %దీణ% లైన్ కిమెన్ పోస్టింగ్ సీనియారిటి ప్రకారం పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. అధిక పని భారంతో మగ్గిపోతున్నామని బ్రిటిష్ కాలం నాటి మ్యానువల్స్ మార్చేలా యూనియన్ తరుపున పోరాటం చేయాలని, మహిళ ఉద్యోగులకు పని భారం తగ్గించాలని యూనియన్ నేతలకు కార్మికులు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ సెక్రెటరీ యుగంధర్ యాదవ్ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన కోర్కెలు అధికారులతో చర్చించి పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు, పలువురు మజ్దూర్ యూనియన్ లో చేరారు ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ చైర్మన్ ముకుందం, అసిస్టెంట్ సెక్రెటరీ బాబు రావు వైస్ చైర్మన్ రవీందర్, సుధాకర్, యూత్ సెక్రెటరీ భాస్కర్, సీనియర్ మజ్దూర్ యూనియన్ నాయకులు మహేష్, బాబు, రాజ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు



# పోలీస్ స్టేషన్ లను సందర్శించిన మానుకోట జిల్లా ఎస్పీ డా.శబరీష్

**సమస్యత్మక ప్రాంతాలపై దృష్టి పెట్టాలి- ఎస్పీ డా. శబరీష్**




**కేసముద్రం,నవంబర్ 26,తొవ్వ:**
మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా"శబరీష్ బుధవారం మహబూబాబాద్ జిల్లా పరిధిలోని కేసముద్రం, ఇనుగుర్తి,నెల్లికుదురు పోలీస్ స్టేషన్ లను సందర్శించారు. మొదట కేసముద్రం సందర్శనలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల గురించి యూ.ఐ,పెండింగ్ కేసులు,మర్డర్ కేసులు, దొంగతనాలు ఇతర వివరాలు ఎస్.ఐ క్రాంతి కిరణ్ ను ఆరతీశారు. బౌగోలిక మ్యాప్ ద్వారా మండల పరిధిలో ఎన్ని గ్రామ పంచాయితీలు ఉన్నాయి అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యత్మక గ్రామాల గురించి అడిగి శాంతియుతంగా గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగేలా చూసుకోవాలని అన్నారు.గ్రామ పంచాయితీ ఎన్నికల దృష్ట్యా అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాల వివరాలు వాటి పనితీరు తెలుసుకున్నారు.ఇనుగుర్తు సరిహద్దు చెక్ పోస్ట్ వివరాలు అడిగారు కొత్తగా ఏర్పడిన పోలీస్ స్టేషన్ కాబట్టి ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా విధులు నిర్వహిస్తు ఎల్లపుడు అందుబాటులో ఉండాలన్నారు. నెల్లికుదుర్ పోలీస్ స్టేషన్ సందర్శించి ఎన్నికల సమయంలో సమస్యలు, సమస్యత్మక ప్రాంతాల పై దృష్టి సారించాలన్నారు. సిబ్బందితో మాట్లాడి వారికీ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి అన్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వాహించాలని అన్నారు. ఈ సందర్శనలోవారి వెంట కేసముద్రం సీఐ సత్యనారాయణ, నెల్లికుదురు ఎస్సై సిహెచ్ రమేష్ బాబు, కేసముద్రం ఎస్.ఐ క్రాంతి కిరణ్,ఇనుగుర్తి ఎస్.ఐ కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# పకడ్బందీగా, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

**కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశం**

వరంగల్,నవంబర్ 26: గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధన లకు అనుగుణంగా పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీపీవో కల్పనతో కలిసి కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. నోటిఫికేషన్ విడుదలైనందున జిల్లాలోని 11 మండలాల్లో 317 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలు, 2754 వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27, 30, వచ్చే నెల 3 తేదీల్లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు.నామినేషన్ నుంచి చివరి ఫలితాల ప్రకటన వరకు ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఏ సందేహం ఉన్నా వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. ఎన్నికల విధులు అత్యంత కీలకమైనవని, చిన్న పొరపాటుకు కూడా అవకాశం ఇవ్వకూడదని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు నగదు, మద్యం ఇతర వస్తువుల పంపిణీ వంటి చర్యలను అరికట్టేందుకు ప్రత్యేక పర్యవేక్షణ అవసరమన్నారు.చెక్‌పోస్టుల్లో వాహన తనిఖీలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో మాన్‌పవర్ మేనేజ్‌మెంట్, బ్యాలెట్ బాక్సుల సమన్వయం, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, శిక్షణా కార్యక్రమాలు, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఖర్చుల పర్యవేక్షణ, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వంటి విభాగాల బాధ్యతలను నోడల్ అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడంలో ప్రతి నోడల్ అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉన్నందున అందరూ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. అధికారులు పరస్పర సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు సుమ, ఉమారాణి, ఎన్నికల ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కందిమల్ల గోపాల్ రెడ్డి

**యాదాద్రి జిల్లా:రామన్నపేట, తొవ్వ ప్రతినిధి:నవంబర్ 26**
రామన్నపేట మండలంలోని నీర్నేముల గ్రామానికి చెందిన జర్నలిస్టు ముత్యాల రమేష్ వివాహం స్థానిక దుర్గయ్య ఫంక్షన్ హాల్లో జరిగింది. వివాహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల కందిమల్ల గోపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆవుల నరసింహ, సల్ల సత్య ప్రకాష్, ఆవుల పర్వతాలు, రామ్ శివకుమార్, నోముల ప్రవీణ్, నోముల విష్ణు, నోముల మల్లేష్, నోముల వంశీ, నోముల నరసింహ, నోముల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమ

**42 శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలకుమోసం**

**స్థానిక పోరులో బి ఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి**

**కాంగ్రెస్ తగిన గుణపాఠం చెప్పాలి**

**బిఆర్ఎస్ జిల్లా నాయకులు నల్లాని నవీన్ రావు**



తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 26 తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పేరుతో పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కపట ప్రేమ చూపుతోందని బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు నల్లని నవీన్ రావు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ కుల గణన చేసి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి కేవలం 14 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించడం రాష్ట్రంలో బీసీలను మోసం చేయడమేనన్నారు. నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం 24 % రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి అమలు చేసిన ఘనత గత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు. జిల్లాలో 482 గ్రామాల్లో కేవలం 24 గ్రామపంచాయతీలను మాత్రమే బీసీలకు కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలోని 18 మండలాల్లో నాలుగు మండలాల్లో బీసీ రిజర్వేషన్లు లేకపోవడం శోచనీయమన్నారు. మండలంలో 31 గ్రామపంచాయతీలో కేవలం నాలుగు గ్రామపంచాయతీలు మాత్రమే బీసీల కేటాయించడం జరిగిందన్నారు. రిజర్వేషన్లను ఏ ప్రాతిపదికన చేశారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి బూటకపు హామీలతో మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పి స్థానిక సంస్థల్లో టిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. స్థానిక సంస్థల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

# నకిలీ ఐఎఎస్ అవతారం

**ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు**

హైదరాబాద్,నవంబర్ 26: ఐఏఎస్‌గా అవతారమెత్తి ప్రజలను మోసగిస్తున్న వ్యకిని ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీగార్డ్స్‌లోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పశ్చిమ మండలం డీసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. చంపాపేటకు చెందిన బత్తిని శశికాంత్ ఏనిమేషన్ కోర్సు చేసి చిన్న కంపెనీ ఏర్పాటు చేశాడు. ఇతని స్వస్థలం ఏపీలోని ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు. ఇటీవల షేక్‌పేటలోని అపర్ణ ఔరా అపార్టుమెంట్‌కు మకాం మార్చాడు. నేర్చుకున్న ఏనిమేషన్ కోర్సును ఉపయోగించి తన పేరిట నకిలీ ఐఏఎస్, ఐపీఎస్, ఎన్‌ఐఏ అధికారుల గుర్తింపు కార్డులు తయారు చేశాడు. పోలీసు, ఎన్‌ఐఏలో ప్రత్యేక ఆపరేషన్ల కోసం తనను ప్రభుత్వం నియమించిందని నమ్మబలుకుతూ తిరుగుతుండేవాడు. తమిళనాడుకు చెందిన విశ్రాంత సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రవీణ్, విమల్‌ను గన్‌మెన్లుగా నియమించుకున్నాడు. గన్‌మెన్లతో కలిసి షేక్‌పేటలోని గోల్డ్ జిమ్‌కు వెళ్లేవాడు. కసరత్తు చేస్తున్న సమయంలో ఫోన్ రింగ్‌కాగా ప్రత్యేక ఆపరేషన్‌కు వెళుతున్నానంటూ హడావిడిగా జిమ్ నుంచి బయటికి వెళ్లేవాడు. ఈనేపథ్యంలో టీఎస్‌ఐఐసీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని, ఖాళీ స్థలాలు కేటాయించే విభాగానికి ప్రత్యేక ఐఏఎస్ అధికారినంటూ జిమ్ ఎండీ అలీ హసన్‌కు చెప్పాడు. పరిశ్రమ స్థాపన కోసం స్థలం కేటాయింపు జరిగిదంటూ నకిలీ అలాట్‌మెంట్ ఆర్డర్ తయారు చేసి అలీ హసన్‌కు చూపించి, రూ. 10. 50 లక్షల నగదు బ్యాంకు నుంచి బదిలీ చేయించుకున్నాడు. జిమ్‌కు వచ్చే మరో వ్యక్తి నుంచి రూ. 10లక్షలు వసూలు చేశాడు. కేటాయింపు జరిగిందని చూపించిన స్థలం తన పేరుపై బదిలీ కాకపోవడంతో అలీ హసన్‌కు ఇతని ప్రవర్తనపై అనుమానం వచ్చి ఫిల్మ్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శశికాంత్‌ను అరెస్టు చేసి రెండు చరవాణులు, ఆరు సిమ్‌కార్డులు, రెండు వాకీటాకీలు, నకిలీ ఐఏఎస్, ఐపీఎస్, ఎన్‌ఐఏ అధికారుల గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఇతనికి గన్‌మెన్లుగా వ్యవహరించిన తమిళనాడుకు చెందిన విశ్రాంత సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రవీణ్, విమల్‌ను అరెస్టు చేయాల్సి ఉందని డీసీపీ శ్రీనివాస్ చెప్పారు.

# 28న అమరావతికి నిర్మలాసీతారామన్

**పలు నూతన భవనాలకు శంకుస్థాపన**

**అమరావతి,నవంబర్26:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు.. వివిధ సంస్థల ఆఫీసులు కూడా రెడీ అవుతున్నాయి.. ఇక, ఆర్బీఐ సహా పలు జాతీయ, ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా అమరావతిలో రానున్న రోజుల్లో తమ కార్యకలాపాల నిర్వహణ కోసం సిద్ధం అవుతున్నాయి.. వాటికి అనుగుణంగా ఇప్పుడు కొత్త భవనాలను నిర్మించనున్నారు.. 28న రాజధాని అమరావతిలో పర్యటించనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. రాజధాని అమరావతిలో ఆర్‌బిఐ సహా 25 జాతీయ, ప్రయివేట్, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లకు సంబంధించిన నూతన భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు.. అన్ని బ్యాంకులకు ఒకేసారి శంకుస్థాపన చేయనున్నారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్..ఇక, నిర్మలా సీతారామన్ పర్యటన నేపథ్యంలో.. జ=ణూ ప్రధాన కార్యాలయం వద్ద సభా వేదిక ఏర్పాటు చేయనున్నారు.. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారాయణ, నారా లోకేష్ హాజరుకానున్నారు. ఇప్పటికే వివిధ బ్యాంకులకు భూ కేటాయింపులు చేసింది జ=ణూ.. బ్యాంకులతో పాటు.. అధికారుల నివాస భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు.



# రామ్‌ను లవ్ యూ అనేసిన భాగ్యశ్రీ

ఇక రెండ్రోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రా కింగ్ తాలూకా మ్యూజిక్ కాన్సర్ట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. రామ్‌పై ప్రశంసల వర్షం కురిపించింది. మీరు కింగ్ ఆఫ్ హార్ట్స్... ఐ లవ్ యూ అంటూ అందరిముందు ఓపెన్ అయ్యింది. దాంతో భాగ్యశ్రీ – రామ్‌ల మధ్య ఏదో జరుగుతుందని జనాలు ఫిక్స్ అయ్యారు. ఇంత జరుగుతున్నా రామ్ వైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం కూడా అనేక అనుమానాలకు తావిచ్చింది. తాజాగా భాగ్యశ్రీ భోర్సేతో ప్రేమాయణంపై రామ్ పోతినేని స్పందించారు. ఆంధ్రా కింగ్ తాలూకా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఛానెల్‌తో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 16 ఏళ్లకే కెరీర్ ప్రారంభించారు, చాలామంది హీరోయిన్స్‌తో వర్క్ చేశారు. ఇప్పటి వరకు మీ గురించి ఒక్క రూమర్ లేదు.. కానీ ఈ ఫిల్మ్‌కు ఎందుకో రూమర్స్ బయటికొచ్చాయని ఓ విలేకరి ప్రశ్నించారు. దీనికి రామ్ స్పందిస్తూ.. ఈ సినిమాకు పాట రాసినప్పటి నుంచి ఇది స్టార్ట్ అయ్యింది. లేకపోతే ఎందుకు స్టార్ట్ అవుతుంది. ఇప్పటి వరకు పాట రాయలేదు, ఫస్ట్ టైం పాట రాశా. ఈ సాంగ్ రాసేసరికి హీరోయిన్ ఎంపిక కూడా జరగలేదని రామ్ తెలిపారు. దాంతో భాగ్యశ్రీ భోర్సేతో తాను డేటింగ్ చేస్తున్నట్లుగా వస్తున్న ఊహాగానాలకు రామ్ పోతినేని చెక్ పెట్టినట్లయ్యింది. కాగా కెరీర్‌లో చాలా మంది హీరోయిన్లతో వర్క్ చేసినప్పటికీ రామ్ గురించి పెద్దగా ఎలాంటి రూమర్స్ రాలేదు. అలాంటిది భాగ్యశ్రీ భోర్సేతో ఆయన డేటింగ్ చేస్తున్నాడంటూ వార్తలు రావడం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. దీనికి కారణాలు లేకపోలేదు. రామ్, భాగ్యశ్రీలు పోస్ట్ చేసిన ఫోటోలు, వీడియోలలో బ్యాక్‌గ్రౌండ్, వస్తువులు ఒకేలా ఉండటంతో వీరిద్దరి మధ్య ఏదో జరుగుతుందన్న రూమర్స్‌కు బలం చేకూరేలా చేశాయి. ఇక ఎన్నడూ లేని విధంగా రామ్ పోతినేని రచయితా మారి ఈ సినిమా కోసం ఓ సాంగ్ కూడా రాశాడు. ఇది భాగ్యశ్రీని ఉద్దేశించి రాసినదేనని గాసిప్స్ వైరల్ అయ్యాయి.

# ఎన్టీఆర్ సినిమా టైటిల్ డ్రాగన్ కాదా?




టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ – 'కేజీఎఫ్' డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో తెరకెక్కుతున్న సినిమా 'డ్రాగన్ '. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ పాన్-ఇండియా మూవీపై సినీ వర్గాల్లో భారీ హైప్ క్రియేట్ అయింది. ఈ మూవీలో 'కాంతార' బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ఫస్ట్ లుక్‌లు అభిమానుల్లో అంచనాలను ఆకాశానికి చేరాయి. అయితే, ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కు 'డ్రాగన్' అనే పేరు ఫైనల్ కాలేదని నిర్మాతలు చెప్పడం హాట్ టాపిక్ గా మారింది. ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ చ%చీ=%31. ప్రస్తుతం వర్కింగ్ టైటిల్ 'డ్రాగన్' అనే పేరు పెట్టారు. ఈ సినిమా 2024 చివర్లో అధికారికంగా అనౌన్స్ అయినప్పటికీ, ప్రిత్విరాజ్ సుకుమారన్, రాజమౌళి వంటి వాళ్లు 'డ్రాగన్' అని పలు సందర్భాల్లో ప్రస్తావించడంతో ఆ పేరే ఫైనల్ అన్న అభిప్రాయం ఏర్పడింది. దీంతో యాక్షన్, మాస్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను థియేటర్లలో కట్టిపడేస్తుందని ఇండస్ట్రీలో గట్టి నమ్మకం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ మూవీ టైటిల్ ఫైనల్ కాలేదని నిర్మాతలు మైత్రి మూవీ మేకర్స్ స్పష్టం చేశారు.తాజాగా నిర్మాత మైత్రి రవి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.." 'డ్రాగన్' కేవలం టెంటేటివ్ టైటిల్స్‌లో ఒకటి మాత్రమే. ఇంకా చాలా ఆప్షన్స్ పరిశీలిస్తున్నాం. మూవీ స్కేల్, ఎన్టీఆర్ క్యారెక్టర్ డిమాండ్‌కు తగ్గట్టు అంతర్జాతీయ స్థాయి టైటిల్ ఫిక్స్ చేస్తాం" అని తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జోరుగా సాగుతోంది. ఆఫస్ట్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత ఆఫ్రికాలో భారీ షెడ్యూల్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. 2026లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎన్టీఆర్ కెరీర్‌లో ఇది ఒక యూనివర్సల్ బ్లాక్‌బస్టర్ అవుతుందని టాలీవుడ్ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.అయితే ఇప్పుడు మూవీ నిర్మాతల కామెంట్స్ తో ఇంతకీ సినిమా టైటిల్ ఏంటీ? అనే చర్చ మొదలైంది. ఇండస్ట్రీలో ఏ విషయం దాచాలని ప్రయత్నించినా.. బయటపడకుండా కాపాడటం చాలా కష్టం. ముఖ్యంగా మూవీ అప్డేట్స్, టైటిల్స్ విషయంలో మూవీ మేకర్స్ ఎంత జాగ్రత్త పడినా.. ఎప్పుడో ఒక్కసారి బయటపడుతునే ఉంటాయి. గతంలో కొరటాల శివ – మెగాస్టార్ చిరంజీవి కాంబో మూవీ ఆచార్య సినిమా టైటిల్‌ను, అధికారికంగా ప్రకటించే ముందే చిరంజీవి స్వయంగా ఒక ఈవెంట్‌లో పొరపాటున బయటపెట్టారు. వెంటనే సారీ చెప్పినా, అప్పటినుంచి "మెగా లీక్స్" అనే పదం ఇండస్ట్రీలో బాగా ప్రాచుర్యం పొందింది.

# ఫ్యాన్స్‌కు బాలయ్య 'డబుల్' ట్రీట్..

బాలకృష్ణ ప్రస్తుతం హిట్ కాంబినేషన్ ను రిపీట్ చేస్తున్నాడు. తనకు ఇప్పటికే తనకు సింహా, లెజెండ్, అఖండ వంటి హిట్స్ ఇచ్చిన దర్శకుడు బోయపాటి




శ్రీనుతో నాల్గోసారి 'అఖండ 2 తాండవం' సినిమాతో పలకరించబోతున్నాడు. ఈ సినిమా డిసెంబర్ 5న ప్యాన్ ఇండియా లెవల్లో తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ, భోజ్ పురి, అవథ్ భాషల్లో విడుదల కాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ట్రైలర్ అఖండ 2 తాండవం పై అంచనాలు పెంచేశాయి. ఈ సినిమా తెలుగు రాష్ట్రాలతో పాటు హిందీలో భారీ బిజినెస్ చేసినట్టు సమాచారం. అంతేకాదు బాలకృష్ణ కెరీర్ లో తొలి ప్యాన్ ఇండియా చిత్రం ఇదే కావడం గమనార్హం. ఓ హీరో సినిమా 65 యేళ్ల వయసులో ప్యాన్ ఇండియా లెవల్లో విడుదల కావడం అనేది మాములు విషయం కాదు. రజనీకాంత్, కమల్ హాసన్, చిరంజీవి, మోహన్ లాల్ తర్వాత ఈ ఏజ్ లో ప్యాన్ ఇండియా వ్యాప్తంగా తన సినిమాను విడుదల చేసిన సీనియర్ హీరోగా బాలయ్య రికార్డులకు ఎక్కాడు. తాజాగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో చేస్తోన్న చిత్రంలో చారిత్రక పాత్రలో కనువిందు చేయబోతున్నాడు. ఈ మూవీలో బాలకృష్ణ మరోసారి డ్యూయల్ రోల్లో చేయబోతున్నట్టు తెలుస్తుంది. ఇద్దరు రాజులు కత్తితో పట్టుకున్న ఫోటో ను విడుదల చేశారు. వీరిసింహారెడ్డి తర్వాత మరోసారి గోపీచంద్ మలినేనితో మరోసారి డ్యూయల్ రోల్ ఫార్ములాతోనే ఆడియన్స్ ముందుకు రాబోతున్నాడు. ఇక బాలయ్య, బోయపాటి శ్రీను విషయానికొస్తే.. వీళ్ల కాంబినేషన్ లో వచ్చిన అన్ని సినిమాల్లో బాలకృష్ణ డ్యూయల్ రోల్స్ చేయడం విశేషం. తాజాగా గోపీచంద్ మలినేని .. బాలకృష్ణ తో చేయబోతున్నది చారిత్రక నేపథ్యమున్న సినిమా. ఈ సినిమా పూజా కార్యక్రమానికి ఏపీ మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ హాజరై స్క్రిప్ట్ ను నిర్మాతలకు అందజేశారు. బి.గోపాల్ తొలి షాట్ కు క్లాప్ కొట్టారు. బాలయ్య చిన్న కూతురు తేజస్విని కెమెరా స్విచ్చాన్ చేశారు. ఫస్ట్ షాట్ కు బాబీ, బోయపాటి శ్రీను, బుచ్చిబాబు సమిష్టిగా డైరెక్ట్ చేశారు. ఈ కార్యక్రమానికి స్టార్ దర్శకులు, అనేక మంది నిర్మాతలు హాజరయ్యారు.

# ఆన్‌లైన్ వేధింపులపై సమంత పోరాటం

ప్రముఖ నటి సమంత, మహిళలపై ఆన్‌లైన్‌లో పెరుగుతున్న వేధింపులను ఎదుర్కోవడానికి ముందుకు వచ్చారు. ఈ లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పనిచేస్తున్న 'యూఎన్ విమెన్ ఇండియా'తో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. మహిళలపై డిజిటల్ ప్రపంచంలో జరుగుతున్న హింసను నివారించేందుకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకూ జరుగనున్న 16 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో తాను పాల్గొంటున్నట్లు సమంత ఇప్పటికే తెలియజేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా ద్వారా తన 37 మిలియన్ల అనుచరులను ఉద్దేశించి మాట్లాడిన ఆమె, ఆన్‌లైన్ వేధింపులపై తన అనుభవాలను వెల్లడించారు. "సోషల్ మీడియాలో అసభ్య వ్యాఖ్యలు, బెదిరింపులు, డీప్ ఫేక్ చిత్రాలు వంటి అనేక రూపాల్లో మహిళలు దాడులకు గురవుతున్నారు. గతంలో ప్రత్యక్షంగా జరిగే ఈ వేధింపులు ఇప్పుడు డిజిటల్ ప్రపంచానికి మారాయి. ఇవి మనసును దెబ్బతీసేలా, ఆత్మవిశ్వాసాన్ని తగ్గించేలా ఉంటాయి," అని సమంత భావోద్వేగంతో తెలిపారు. తాను కూడా ఇలాంటి పరిస్థితులను పలుమార్లు ఎదుర్కొన్నానని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం మహిళల్లో ఆన్‌లైన్ హింసపై అవగాహన పెంపొందించడం అని సమంత వివరించారు. డిజిటల్ వేధింపులను అరికట్టేందుకు మరింత ప్రభావవంతమైన వ్యవస్థలు, కఠినమైన చట్టాలు తప్పనిసరిగా అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. యూఎన్ విమెన్ ఇండియా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగం కావడం తనకు గర్వకారణమని సమంత పేర్కొన్నారు.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146